నమస్తే తెలంగాణ

# కామారెడ్డి

5 | నిజామాబాద్, సోమవారం 5 ఫిబ్రవరి 2024 | KAMAREDDY

**అరుదుగా** కనిపించే కృష్ణ జింకలు జీవించలేకపోతున్నాయి. గోదావరి తీరాన కనువిందు చేసే జింకలు కనుమరుగవుతున్నాయి. వేలల్లో ఉండే జింకలు ఇప్పుడు వందలకు చేరాయి. ఇలాగే చూస్తూ పోతే ఈ ప్రాంతంలో పూర్తిగా కనుమరుగయ్యే పరిస్థితి నెలకొన్నది. నిత్యం కుక్కల దాడులకు బలి అవుతున్నాయి. కృష్ణ జింకలు, అరుదైన పక్షులకు నెలవైన గోదావరి నదీ తీరాన్ని అందమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని చెబుతున్న అటవీ అధికారులు.. జింకలను కాపాడేందుకు ఏమాత్రం ప్రయత్నం చేయకపోవడంతో విడ్డూరం. పర్యాటక కేంద్రం దేవుడెరుగు కనీసం ఉన్న జీవాలను కాపాడకపోవడంపై విమర్శలు గుప్పుమంటున్నాయి.

– నందిపేట్, ఫిబ్రవరి 4

**నిజామాబాద్** జిల్లా నందిపేట మండలంలో శ్రీరాంసాగర్ బ్యాక్‌వాటర్ ప్రాంతం పర్యాటకులకు ఆహ్లాదం పంచుతున్నది. పక్షుల కిలకిలరావాలు.. కృష్ణజింకల సయ్యాటలు..ఇతర వన్యప్రాణుల విహారాలు కనువిందు చేస్తాయి. గత కొన్నిరోజులుగా గోదావరి తీర ప్రాంతంలోని కృష్ణజింకలను ఊర కుక్కలు వేటాడుతున్నాయి. దప్పిక తీర్చుకునేందుకు వచ్చే క్రమంలో జింకలు బురదలో ఇరుక్కుపోతున్నాయి. ఇదే సమయంలో కుక్కలు వేటాడి చంపుతున్నాయి.

# అయ్యో.. 'కృష్ణ'

జింకలను వేటాడుతున్న కుక్కలు

గోదావరి తీరాన జీవాల గోస

వన్యప్రాణులకు రక్షణ కరువు

పట్టించుకోని అటవీశాఖ అధికారులు

కుక్కల దాడిలో మృతి చెందిన జింక(ఫైల్)



## అరుదైన జీవాలకు నెలవు..

గోదావరి నదీ తీరం జింకలతోపాటు అరుదైన పక్షులకు నెలవు. ఫ్లెమింగో, పెలికాన్, కామన్ క్రేన్, సముద్రపు పక్షులు, ఇతరత్రా అరుదైన పక్షులు గోదావరి తీరానికి వేల సంఖ్యల్లో వస్తుంటాయి. వేసవికాలంలో వాటి సంచారం ఎక్కువగా ఉంటుంది. పచ్చనిగడ్డి పక్కన నది నీళ్లు.. గుంపులుగా పరిగెత్తే జింకలు, నెమళ్లు, నది ఒడ్డున పక్షులు చూపరులను కట్టిపడేసే ఈ అందాలను వీక్షించేందుకు ఎందరో ప్రముఖులు ఈ ప్రాంతాలకు వస్తుంటారు. పదుల సంఖ్యలో రాష్ట్రస్థాయి అధికారులు పర్యటించారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితోపాటు ఉన్నతస్థాయి అధికారులు సందర్శించారు. వేసవికాలంలో పర్యాటకులు జీప్‌లలో పర్యటిస్తూ పెద్దపెద్ద కెమెరాల్లో ఇక్కడి అందాలను బంధిస్తుంటారు. శని, ఆదివారాల్లో హైదరాబాద్‌తోపాటు ఆయా ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్నారు. ఈ ప్రాంతం అందాలు బయటి ప్రపంచానికి మొన్నటి వరకూ తెలియలేదు. రెండేండ్ల క్రితం నిజామాబాద్‌కు చెందిన వైల్డ్‌లైఫ్ ఔత్సాహిక ఫొటోగ్రాఫర్ సంతోష్ తీసిన ఫొటోలు, వీడియోలు జాతీయస్థాయి మీడియాలో ప్రచురితం కావడంతో ఈ ప్రాంతానికి పర్యాటక కేంద్రంగా గుర్తింపు వచ్చింది. కుక్కల బారి నుంచి జింకలను కాపాడేందుకు అటవీశాఖ అధికారులు ఏమాత్రం చర్యలు చేపట్టకపోవడంపై తీవ్ర విమర్శలు ఎదురవుతున్నాయి.

## వేల సంఖ్య నుంచి వందలకు..

నందిపేట్, డొంకేశ్వర్, నవీపేట్ మండలాల్లోని గోదావరి నదీ తీర ప్రాంతం ఎంతో సువిశాలంగా వేలాది ఎకరాల్లో విస్తరించి ఉన్నది. వానకాలంలో గోదావరి నది నిండుగా ఉంటుంది. తర్వాత నదిలో కొంత నీళ్లు తగ్గి నేల బయటపడుతుంది. గోదావరి తీర ప్రాంతం బాసర నుంచి గాదేపల్లి వరకు సుమారు 25కిలోమీటర్ల మేర వేలాది ఎకరాల్లో పచ్చని గడ్డితో నిండిపోయి ఉంటుంది. గోదావరి నదికి ఆ పక్క ఒడ్డున ఉన్న నిర్మల్ జిల్లా లోకేశ్వర్, ముథోల్ మండలాలకు చెందిన గ్రామాల్లోనూ ఇదే విధంగాఉంటుంది. మేతకు గడ్డి దొరకడంతోపాటుగా సహజ శత్రువులు నక్కలు, తోడేళ్లు, చిరుతలు, పెద్ద పులులు ఈ ప్రాంతంలో లేకపోవడంతో నదికి రెండువైపులా కృష్ణ జింకల సంతతి వేలాదిగా పెరిగింది. అంతేకాకుండా గోదావరి తీరంలో ఉన్న పొదలు, అక్కడక్కడా ఉన్న ఎత్తయిన ప్రదేశాల్లో జీవాలు తలదాచుకోవడానికి అనువుగా ఉండడంతో జింకలు ఈ ప్రాంతంలోనే ప్రశాంతంగా జీవిస్తున్నాయి. వానకాలంలో నీటి ప్రవాహం పెరగడంతో రెండు, మూడు నెలలు కొంత ఇబ్బంది ఏర్పడినా తర్వాత ఏడాదంతా జింకలకు మంచి అనువైన పరిస్థితులే ఉంటాయి. గత రెండేండ్లుగా జింకలపై కుక్కల దాడులు పెరిగిపోయాయి. కుక్కలు గ్రామాల్లోంచి గోదావరి తీరప్రాంతానికి గుంపులుగా వెళ్లి జింకలను వెంటాడుతున్నాయి. జింకలు పరుగెత్తుతూ నది నీళ్ల దగ్గరికి వెళ్లినప్పుడు మెత్తని మట్టిలో వాటి కాళ్లు పైకి లేవకపోవడంతో కుక్కలకు సులభంగా దొరికిపోతున్నాయి. సుమారు 3వేల వరకూ ఉండే జింకలు కుక్కల దాడులతో ఇప్పుడు వందల సంఖ్యకు తగ్గిపోయాయి.



## అభివృద్ధి పనులను రద్దు చేయడమేనా...

# మీరు తెస్తామన్న మార్పు?

మోర్తాడ్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ రద్దుతో నిరుద్యోగులకు తీరని నష్టం

కాంగ్రెస్ సర్కార్ కక్షపూరిత వైఖరిని అవలంబిస్తున్నది

యువత తరలివచ్చి స్కిల్ డెవలప్‌మెంట్‌ను కాపాడుకోవాలి

బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి పిలుపు



కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 4: కాంగ్రెస్ తెస్తామన్న మార్పు అంటే మంజూరైన అభివృద్ధి పనులను రద్దు చేయడమేనా? అని బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. మోర్తాడ్‌లో వేలాది నిరుద్యోగ యువకులకు మేలు చేసే స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయడాన్ని కక్షపూరిత వైఖరిగా పేర్కొన్నారు. నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి బతుకుదెరువు కోసం వేలాది మంది నిరుద్యోగులు గల్ఫ్ దేశాలకు వెళ్తారని పేర్కొన్నారు. వృత్తి నైపుణ్యంతో మంచి జీతం సంపాదించాలనే ఆశయంతో మోర్తాడ్, కరీంనగర్ జిల్లాలోని ఎల్లారెడ్డిపేటలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తాను మంత్రిగా ఒక్కోదానికి రూ.5కోట్ల చొప్పున న్యాక్ ద్వారా మంజూరు చేయించానని గుర్తుచేశారు. జిల్లా కలెక్టర్ భూమిని మంజూరు చేయగా.. వాటి పనులకు తానే శంకుస్థాపన చేశానని, టెండర్లు సైతం పూర్తయ్యాయని వివరించారు. ఈ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లలో ఎలక్ట్రికల్, ప్లంబింగ్, రాడ్ బెండింగ్ తదితర విభాగాల్లో ఏటా 2వేల మందికి వృత్తిశిక్షణనిచ్చి న్యాక్ సర్టిఫికెట్లు అందిస్తుండడంతో మంచి వేతనాలతో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ఉన్నఫలంగా స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లను రద్దు చేసి నిరుద్యోగ యువత ఉపాధి అవకాశాలను దెబ్బ తీస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. మోర్తాడ్‌లో మొదలుపెట్టిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ పనులను యథావిధిగా కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు. స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను కాపాడుకోవడానికి నిరుద్యోగ యువత కదిలి వచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని పిలుపునిచ్చారు. దీంతోపాటు గత ప్రభుత్వ హయాంలో తన ద్వారా మంజూరై ఇంకా ప్రారంభం కానీ అనేక అభివృద్ధి పనులను కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం ఉన్నదన్నారు. కొత్తగా మంజూరై పనులు మొదలుకానీ కుల సంఘాల భవనాలు, ఆలయాలు, చర్చిలు, మసీదులు, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ రోడ్లు, కల్వర్టులు, బ్రిడ్జిలను కాపాడుకునేందుకు ఆయా గ్రామాలకు చెందిన యువకులు, కుల సంఘాలు, వీడీసీలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎమ్మెల్యేగా ప్రార్థిస్తున్నానని కోరారు.



ధర్మారం(బీ) పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

## ప్రశాంతంగా గురుకుల ప్రవేశపరీక్ష

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 4: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ప్రతిభా కళాశాల ధర్మారం(బీ)లో ఆదివారం నిర్వహించిన టీఎస్‌డబ్ల్యూఆర్ సీవోఈ సెట్-2024 ప్రశాంతంగా ముగిసినట్లు కోఆర్డినేటర్ బి.సంగీత తెలిపారు. ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు పరీక్ష నిర్వహించగా, మొత్తం 504 మంది విద్యార్థులకు 494 మంది హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారు. జిల్లాలోని ఆరు కేంద్రాల్లో ప్రవేశ పరీక్ష నిర్వహించగా 2747 మంది విద్యార్థులకు 2659 మంది హాజరుకాగా 88 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.

## బీఆర్ఎస్ సమావేశం వాయిదా

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 4 : మండల కేంద్రంలోని జీ కన్వెన్షన్‌లో సోమవారం నిర్వహించాల్సిన బీఆర్ఎస్ నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం అనివార్య కారణాలతో వాయిదా పడినట్లు మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తదుపరి సమావేశం నిర్వహించే తేదీని త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు. సమావేశం వాయిదా కారణంగా పార్టీ కార్యకర్తలు అన్యదా భావించొద్దని, త్వరలోనే డిచ్‌పల్లిలో కేటీఆర్ సభ జరగనున్నదని పేర్కొన్నారు.



## 'డబుల్' ఇండ్ల వద్ద శిలాఫలకం ధ్వంసం

భిక్కనూరు, ఫిబ్రవరి 4: మండలంలోని కాచాపూర్ గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇండ్ల సముదాయం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం ధ్వంసం చేశారు. గత కేసీఆర్ ప్రభుత్వం కాచాపూర్ గ్రామంలో 50 డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించగా.. నిర్మాణ పనులకు అప్పటి ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆదివారం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయగా.. కారకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక బీఆర్ఎస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు

# డమ్మీ పిస్తోల్‌తో హల్‌చల్

జనాలను భయభ్రాంతులకు గురిచేసిన పోకిరీలు

స్థానికుల సహాయంతో పట్టుకున్న మహిళా హోంగార్డు

వినాయక్‌నగర్,ఫిబ్రవరి 4: నగరంలోని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ ఏరియాలో ముగ్గురు ఇంటర్ విద్యార్థులు డమ్మీ పిస్తోల్‌తో హల్‌చల్ చేశారు. చీకట్లో కూర్చొని తమ వద్ద ఉన్న తుపాకీని పేలుస్తూ భయభ్రాంతులకు గురిచేశారు. నగరంలోని ఖిల్లా పరిధిలోని బొడ్డెమ్మ చెరువు సమీపంలో ఉన్న కేంద్రీయ విద్యాలయం పక్కన శనివారం రాత్రి ఈ ఘటన చోటు చేసుకున్నది. బొడ్డెమ్మ చెరువుకు వెళ్లే దారిలో మహిళలు, వృద్ధులు రోజూ సాయంత్రం వాకింగ్ చేస్తుంటారు. శనివారం రాత్రి మహిళలు అటు నుంచి వెళ్తున్న క్రమంలో చీకట్లో కూర్చొని ఉన్న ముగ్గురు పోకిరీలు తమ చేతిలో ఉన్న తుపాకీని పేల్చడంతో భారీ శబ్దానికి వారు ఉలిక్కిపడ్డారు. అదే సమయంలో విధులు ముగించుకొని అటుగా వెళ్తున్న మహిళా హోంగార్డు ఇదంతా గమనించింది. వెంటనే బ్లూకోట్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో స్థానికుల సహాయంతో ఆ ముగ్గురిని ఐదో టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇదిలా ఉండగా గతేడాది అక్టోబర్ 18న వన్‌టౌన్ పరిధిలో సైతం పోకిరీలు డమ్మీ తుపాకీతో జనాలను భయపెట్టారు. దీంతో వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మూడున్నర నెలల్లోనే రెండు ఘటనలు చోటు చేసుకోవడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.



### విచారిస్తున్నాం..

రాత్రి మా సిబ్బంది స్టేషన్‌కు తీసుకువచ్చిన పిస్తోల్‌ను డమ్మీ (లైటర్)తుపాకీగా గుర్తించాం. హైమద్‌పుర, మాలపల్లి కాలనీకి చెందిన ముగ్గురు మైనర్లు.. హైమదీ మార్కెట్‌లో రూ.వెయ్యికి పిస్తోల్‌ను కొనుగోలు చేసినట్లుగా దర్యాప్తులో తేలింది. ఇప్పటి వరకు ఎవరినైనా బెదిరించారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నాం.

- ఎస్.సతీశ్‌కుమార్, నార్త్ రూరల్ సీఐ

## ఆర్మూర్ బస్టాండ్‌లో

# కిడ్నాప్ కలకలం

బాలుడి అపహరణకు మహిళ యత్నం

కమ్మర్‌పల్లి వద్ద గుర్తించిన ప్రయాణికులు

స్థానిక పోలీసులకు బాలుడు, మహిళ అప్పగింత

తల్లిదండ్రుల చెంతకు చేర్చిన ఎస్సై రాజశేఖర్

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 4: జిల్లా కేంద్రంలోని మాలపల్లికి చెందిన బాలుడి కిడ్నాప్ ఘటన మరువకముందే అలాంటి ఘటనే ఆర్మూర్‌లో చోటు చేసుకున్నది. ఆర్మూర్ బస్టాండ్‌లో ఓ మహిళ బాలుడిని అపహరించేందుకు యత్నించగా.. గుర్తించిన ప్రయాణికులు సదరు బాలుడితోపాటు మహిళను కమ్మర్‌పల్లి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం చోటుచేసుకోగా.. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మెండోరా మండల కేంద్రానికి చెందిన జిల్లపల్లి గంగారాం (లైన్‌మన్) ఆదివారం ఉదయం తన భార్య తిరుమల, కుమారుడు గగన్ సిద్ధార్థ్ తేజ్(7)తో కలిసి ఆర్మూర్ మండలం దేగాం గ్రామానికి వెళ్లారు. సాయంత్రం ఆర్మూర్ బస్టాండ్‌కు చేరుకొని బడాభీమ్‌గల్‌కు వెళ్లే బస్సును ఎక్కారు. బస్సులో తమ కుమారుడు సిద్ధార్థ్ కనిపించకపోవడంతో తల్లిదండ్రులు వెంటనే బస్సు దిగి బస్టాండ్‌లో వెతికారు. కనిపించకపోవడంతో ఆర్మూర్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బోధన్ మండలం సాలూరాకు చెందిన సావిత్రి అనే మహిళ గగన్ సిద్ధార్థ్ తేజ్‌ను తీసుకొని మెట్‌పల్లి వెళ్లే బస్సు ఎక్కింది. మార్గమధ్యంలో బాలుడు ఏడుస్తుండడంతో ప్రయాణికులు నిలదీయగా తమ బంధువుల పిల్లవాడు అని సావిత్రి నమ్మించింది. బస్సు మోర్తాడ్ దాటిన తర్వాత బాలుడు గట్టిగా ఏడుస్తూ ఆమె ఎవరో తెలియదని చెప్పడంతో మోస్రా మండలం చింతకుంటకు చెందిన ప్రయాణికులు సాయిశశిధర్‌రెడ్డి, మెట్‌పల్లికి చెందిన సాయికుమార్ బస్సును కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్ వద్ద నిలిపివేయించారు. సావిత్రితోపాటు బాలుడిని పోలీసులకు అప్పగించారు. విషయం తెలుసుకొన్న బాలుడి తల్లిదండ్రులు వెంటనే కమ్మర్‌పల్లికి చేరుకొన్నారు. బాలుడిని తల్లి తిరుమలకు కమ్మర్‌పల్లి ఎస్సై రాజశేఖర్ అప్పగించారు. బాలుడిని అపహరించేందుకు యత్నించిన మహిళను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.



కమ్మర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో బాలుడిని తల్లికి అప్పగిస్తున్న ఎస్సై



## ప్రమాదమని తెలిసినా..

**రాష్ట్ర ప్రభుత్వం** మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆర్టీసీ బస్సులన్నీ కిక్కిరిసి పోతున్నాయి. దీంతో సీట్లు దొరకక విద్యార్థులు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రమాదమని తెలిసినా తప్పనిసరై ఫుట్‌బోర్డుపై నిల్చుని ప్రయాణం చేయాల్సి వస్తోందని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్